


ఒక్కక్షణం రోడ్డుమీద తటపటా యించి ఫాన్సీ షాపులోకి వెళ్ళాడు కుప్పస్వామి. ఆ షాపులోని కొనుగోలుదార్లు ఒక్కసారిగా వెనక్కి తిరిగారు. షాపు యజమాని రంగనాథం తన బరువైన శరీరాన్ని కొంచెం యిబ్బందిగా కుర్చీలో కదిల్చాడు.

అందుకు కారణం లేకపోలేదు. కుప్పస్వామి త్రాగుతున్న బీడీని కుడిచేతి బొటనవ్రేలితో ఆర్పి చొక్కాజేబులో వేసుకున్నాడు. ఏ రంగో తెలీని చొక్కాని పట్టుకుని వ్రేలాడుతున్న నల్లని మొద్దు చేతులతో మొహాన్ని తుడుచుకున్నాడు. అతని నడుమునంటుకుని వ్రేలాడుతున్న పాంటో లేక పైజమానో తెలీని జడ పదార్థం ఏదో తెలీని భయంతో వణికింది. అందరూ అతన్ని వన్యమృగంలా చూస్తున్నారు. అతను కళ్ళు దించేశాడు, తాను యిటువంటి షాపులకి రావడం తప్పని. ఒకరకమైన అసహ్య భావంతో అతనివంక చూసి కొనుగోలుదార్లు వాళ్ళపనుల్లో మునిగిపోయారు. అతను చేసిన నేరమేమీ లేదు. కాకుంటే వాళ్ళదృష్టిలో; వాళ్ళందరూ అందమైన అద్దాల షో కేసులలో అమర్చిన ప్లాస్టిక్ బొమ్మలు. కొసిని పనికిరాని కాగితాలు, చిల్లపెంకులు; నల్లమట్టి కలిపి చేసిన ఆకారాలు కుప్పస్వామి లాంటివాళ్ళు. ఏ పెంటకుప్పమీదనో, మురికి కాలువ గట్లమీదనో వుండవలసినవాళ్ళు; కొసిని పాలూ, మంచులో తడిసిన మల్లెపూలూ; వెన్నెలా, ఆడదాని అసూయా కలిపి తయారుచేసిన యిటువంటి షాపుల్లోకి అనర్హులని వాళ్ళ భావన.

మిగతా ఖాతాదారుల మనసుల్ని పసిగట్టిన రంగనాథం చిన్నగా దగ్గి అన్నాడు 'ఏం కావాలి ?'

ఏ సంబోధన లేకుండా కుప్పస్వామి వొంక చూశాడు.

'చిన్నపిల్లలు ఆడుకునే కారు' అన్నాడు నిర్లిప్తంగా.

'ఏది వాళ్ళు ఎక్కి ఆడుకునేదా ?'

'కాదు...చిన్నది. కీ యిస్తే వెళ్ళేది.'

'ఆఁ అదా...ఆరు రూపాయలవుతుంది'

'ఆరు రూపాయలా?' అని ఒక్కక్షణం మౌనంగా వుండి తిరిగి అన్నాడు 'చూపించండి.'

'చూడదలుచుకుంటే రోడ్డుమీదమండి'

చూడవచ్చు. అద్దాల షో కేసులో వుంది' అన్నాడు రంగనాథం నిర్లక్ష్యంగా. కుప్పుస్వామికి కోపం, బాధా ఒకేసారిగా వచ్చాయి. కాని అతనేమీ చేయలేదు. అతని దగ్గరున్నది నాలుగుసార్లు లెక్కవేసినా మూడు రూపాయల నలభై పైసలకి మించదు. కాని అతను 'కీ'కారు కొనాలి. మూడు రూపాయల కిమ్మత్తు వుంటుందని ఊహించాడు, కాని అది ఆరు రూపాయలు. యింకా ఎక్కువసేపు అక్కడవుంటే మరింత అవమానాలకి గురి కావలసి వస్తుందని నెమ్మదిగా కదిలాడు కుప్పుస్వామి.

'ప్రవేశం పరిమితం' అనే బోర్డు పెట్టడం మంచిది.' అంటూ అంగ్లంలో సలహా యిస్తున్నాడు ఒక తెలుగువాడు. ఉదాసీనంగా అతని కళ్ళల్లోకి చూశాడు కుప్పుస్వామి, అతను చొక్కామీద లేని దుమ్మని దులుపుకుంటున్నాడు.

* * *

సృష్టిలో ప్రతి వస్తువుకీ విలువ వుంది.

ఈ విషయం తెలీదు అలివేలుకి. తెలిసిన ఈ విషయాన్ని ఆమెకి చెప్పడం చేతకాదు కుప్పుస్వామికి. కారణం అతనికి ఎలా చెప్పాలో తెలీదు. అందుకనే అతని ఆఫీసర్ తరుచు అంటూ వుంటాడు —

'మిష్టర్ కుప్పుస్వామీ నీకేమీ తెలియదు. తెలిసినా చెప్పలేవు. నీకు కావలసిన ధైర్యం లేదు. ఆత్మ సైంధర్యం లేదు. పూర్ ఫెలో...'

ఆరు సంవత్సరాల నుండి నేటివరకు ఉద్యోగసీటులో మకుటంలేని మహారాజులా వెలిగిపోతున్నాడు కుప్పుస్వామి. అతని జూనియర్స్‌కి ప్రమోషన్లు వస్తున్నాయి. కాని కుప్పుస్వామి యథాస్థానంలోనే వుంటున్నాడు. ఆఫీసరుగారి టైగర్ (పెంపుడుకుక్క) బర్త్‌డే పార్టీకి ఆయన కుప్పుస్వామిని మినహాయించి అందరిని తన గదిలోకి పిలిచి టీ పార్టీకి ఆహ్వానించాడు. పార్టీకి వెళ్ళకపోయినా, టైగర్‌కి బహూకరించిన 'వెండి గిన్నె'కి చందా యివ్వక తప్పలేదు. అంత అనామకుడిగా ఆఫీసులో వెలుగుతున్న అతని కొక విలువుందని ఎవరూ గుర్తించలేదు. ఎవరిదాకా ఎందుకు—అతని అర్ధాంగి అలివేలు ఎప్పుడూ అతనిని అర్ధం చేసుకోడానికి ప్రయత్నించ లేదు.

అందమైనదని చెప్పబడుతున్న అలివేలుకి పెండ్లి అవుతుందని ఎవరూ అనుకోలేదు. ఆమె తండ్రి రాఘవయ్య ఎంతో ప్రయత్నం చేశాడు. అనేక సంబంధాలు తీసుకువచ్చాడు. కొన్ని అలివేలుకి నచ్చేవి కావు. కొంతమందికి అలివేలు వచ్చేదికాదు. మరికొన్ని కట్నాల విషయంలో రాఘవయ్యకి నచ్చేవి కావు. పల్లెటూరిలో 'ప్రయివేట్' వ్యవహారాలు చేస్తూ సోమరిపోతులా కాలక్షేపం చేస్తున్న రాఘవయ్యకి అలివేలు పెండ్లి పెద్ద సమస్యఅయింది. కాని విచిత్రంగా కుప్పుస్వామితో వివాహానికి ఒప్పుకుంది అలివేలు. దీనికి కారణం లేకపోలేదు. అయిదో క్లాసువరకు చదివిన అలివేలు, తన ఇరవై సంవత్సరాల వయసులో సినిమాలూ, నాటకాలూ, రైళ్ళు, బస్‌లూ, ఎన్నిసార్లు చూసిందో వేళ్ళమీద లెక్కపెట్టగలదు. కుప్పుస్వామికి పట్నంలో ఉద్యోగం. కుప్పుస్వామి కన్నా పట్నవాసంమీద మోజువల్ల ఒప్పుకుంది. రెండువేలు తనవి కాదనుకుని కుప్పుస్వామి కాళ్ళు కడిగాడు రాఘవయ్య. నగరానికి వచ్చిన నాలుగు సంవత్సరాలలోనే చాలా మారిపోయింది అలివేలు. కుప్పుస్వామి వాళ్ళు వుంటున్న యిల్లు చిన్న హాస్టల్ అని చెప్పవచ్చు. సుమారు పన్నెండు కాపురాలుంటున్న ఆ కొంపలో విశ్వవిద్యాలయాల మహారాజ పోషకులైన యిద్దరు విద్యార్థులు ఆమె భక్తులు.

ఆమె చదివిన ఆరు నయాపైసల అద్దె సాహిత్యపు భాషలో వాళ్ళు ఆమె బాయ్‌ఫ్రెండ్స్. తమ కుచ్చు కాళ్ళూ, చేతులూ నలుగురికి చూపించాలని 'నారో' దుస్తులు ధరించి ఏదో కొరివిలు అంటుకున్నట్లు పరిగెత్తేవాళ్ళనీ, అసలు కాళ్ళూ, చేతులూ, వున్నాయో, లేవో, తెలీని దుస్తులలో 'ఈదురో' మంటూ వెళ్ళే భర్తనీ పోల్చుకుని బాధపడేది అలివేలు.

* * *

కుప్పుస్వామి నడుస్తున్నాడు. అతని కళ్ళు మండిపోతున్నాయి. ఫుట్‌పాత్‌ల వెంక ఆదుర్దాగా చూస్తున్నాడు. ఎక్కడైనా పిల్లల ఆటసామాన్లు అమ్ముతున్నారేమో అని. అతని గుండెలు వీండిపోతున్నాయి నిరాశతో. కడుపులో ఎలుకలు గోల చేస్తున్నాయి. అతనిచేతులు చలనరహితంగా వున్నాయి. అతను ఆలోచిస్తున్నాడు.

'బలమైన తిండి తినమంటాడు డాక్టర్. 'బలమైన తిండి' అంటూ గాఢంగా నిట్టూర్చాడు. 'తిండికన్నా ముఖ్యమైనది మనసు. ఎప్పుడూ కులాసాగా, నవ్వుతూ, జీవితాన్ని చులకనగా తీసుకుని కాలక్షేపం చేయాలి' యింకో డాక్టరి సలహా. 'నవ్వుతూ కులాసాగా వుండాలి' 'ఎలా ఎలా' అతను ఆగాడు. జేబులోంచి ఒక కాగితం తీశాడు. ఆకాగితం నిండా అంకెలే. ఆరోజు మొదటి తేది. తల్లికి నలభై రూపాయలు మనియార్డరు చేశాడు. లేకపోతే తిరుగుటపాలో ఆవిడ తగవులాటకి వస్తుంది. బాకీలు కొన్ని చెల్లించాడు. క్రొత్త అప్పులు చేయాలంటే పాతబాకీలు చెల్లించాలి. మిగిలింది మూడురూపాయల నలభై పైసలు. అదీ బాకీల క్రింద జమకట్టేవాడే. కాని గత రెండుమూడు నెలలుగా అతని మనసులో ఒక కోరిక వుంది. ఎవరు ఎంత తనని అసహ్యించుకున్నా చీదరించుకున్నా అతని కొడుకు రంగడు మాత్రం 'నాన్నా నాన్నా' అంటూ ఆప్యాయంగా దగ్గరికి వచ్చేవాడు. రంగడికి తల్లి అంటే భయం. అలివేలుకి రంగడంటే వంటిమీద గొంగళీలు ప్రాకినట్లు బాధపడుతుంది. రంగడువల్ల తన వయసు ప్రతి సంవత్సరం పెరుగుతుందని బాధపడుతుంది. ఏదో వేళకింత ఉడకేసి, సినిమాలూ, పత్రికల గురించి గంటల తరబడి, తన పక్కింటి వాళ్ళతో చర్చించేది. అసలు రంగడి వ్యవహారం పట్టించుకునేది కాదు. అప్పుడప్పుడు అనుకునేది 'ఏదో తెలిసీ, తెలియని వయసులో వాడ్ని కన్నాను. బుద్ధి తక్కువ పనిచేశాను.'

రంగడు అంటే కుప్పుస్వామికి ప్రాణం. వాడు అసలు తండ్రిని ఏమీ అడిగేవాడు కాదు. ఎప్పుడూ మూగగా వీధిలో తిరుగుతున్న మనుష్యుల్నీ, కార్లనీ, బండ్లనీ చూస్తూ వుండేవాడు. రెండుమూడుసార్లు రంగడు ఎదురింటి ప్లీడరుగారి అబ్బాయి ఆడుకుంటున్న కీ యిస్తే వెళ్ళే చిన్నకారు

[illegible] గమనించాడు కుప్పుస్వామి.

'నాన్నా! నాకు ఒక కారు తెచ్చిపెట్టవూ' నోరు తెరిచి అడిగాడు.

'తెస్తాను—' అన్నాడు కుప్పుస్వామి దీపాల వెలుగులో నడుస్తున్నాడు కుప్పుస్వామి.

*          *          *

'వచ్చేశారా ... వచ్చేశారా మీకోసమే ఎదురు చూస్తున్నాను' అంటూ వీధి గుమ్మం దగ్గరే అలివేలు స్వాగతం చెప్పింది.

ప్రతినెలా ఒకటో తేదీన అలివేలు వీధి గుమ్మం దగ్గర కాపు వేయడం దారిదోపిడి దొంగలా రెండుమూడు రూపాయిలు భర్త దగ్గరనుండి గుంజడం మామూలే.

ఈ అలివేలు సంగతి ఆలోచించి కుప్పుస్వామి గుండెలు గుభేలు మన్నాయి

'రంగడు ఏడీ?' అన్నాడు మామూలుగా.

'నిద్ర పోతున్నాడు' ఆమె నేలమీద కుడికాలి బొటనవ్రేలితో రాస్తున్నది.

'అప్పుడే నిద్రపోయాడా?' ఆశ్చర్యంగా ప్రశ్నించడం.

'యిప్పుడు ఎంతయిందనుకుంటున్నారు, ఎనిమిది దాటింది' ఆమెమాట పూర్తి కాలేదు. పక్కింటి పిన్నిగారు బిగ్గరగా అరిచింది.

'అలివేలూ వనయిందా? త్వరగా వెళ్ళాలి. లేకపోతే టికెట్లు అందవు' ఉలిక్కిపడ్డాడు కుప్పుస్వామి.

# విలువ

'మూడు రూపాయలివ్వండి'

'ఎందుకు—' అతనికి తెలుసు ఆమె రెండో ఆట సినిమాకి వెళ్తుందని

'మన పక్కింటి పిన్నిగారితో సినిమాకి వెళ్ళాలి.'

'ఏ సినిమా?'

'ప్రిన్స్'

'అంటే'

'రాజకుమారుడు — హిందీ సినిమా' అంది కోపంగా అలివేలు

'సినిమాల్లో ఏముందే చెత్త—' అతనిమాట పూర్తి కాలేదు, చురుగ్గా అందుకుంది

'అంతా కుప్పుస్వామిగారి కొంపలో వుంది. బురద. కన్నీళ్ళు, నిట్టూర్పులూ, బాధలూ, వైరాగ్యం, దేవుడు. రండి ... రండి ... లండరూ 'యిక్కడ పొర్లండి '

'ఎందుకే అలా గింజుకుంటావ్? నీకేం లోటు చేశాను'

'ఏం చేయలేదనే బాధ ప్రతినెలా వుండే భాగవతమేగా— యివ్వండి త్వరగా వెళ్ళాలి. అయినా నేను తెలియక అడుగుతాను ప్రతినెలా యింత రాద్ధాంతం చేస్తారెందుకు?'

'మోసేవాడికి తెలుస్తుంది భారం'

అప్పుడు నేను మీకు బరువైపోయానూ అసలు నన్ను పెండ్లి ఎందుకు చేసుకున్నారు'

'బుద్ధిలేక—'

'అయితే అనుభవించవలసినది మీరు. కాని నేను కాదు ... రేపో, ఎల్లుండో మద్రాసు నుండి పిలుపు రాక మానదు నేను సినీ హీరోయిన్ కాక మానను. సత్తు బొచ్చెతో మీరు నా వెంట రాక తప్పదు'

'పగటి కలలు కంటూ వుండు. అతనికి మాటలు తడబడుతున్నాయి. భార్యని ఏమీ అనలేని దుస్థితిలో వున్నాడు.

'పగటి కలలని పరిహాసం చేయకండి. నాకు మంచి రోజులు వస్తాయి — అది సరే గాని డబ్బు అంతా అయిపోయిందా?'

'ఈ నెలలో మూడు రూపాయలు పెట్టి ఒక ప్రత్యేక బహుమతి తెచ్చాను'

'ఎవరికి—'

'ఏడీ రంగడు ఏడీ? ఎక్కడ పడుకున్నాడు'

'రంగడు. రంగడు రంగడా ... ఎదురుగుండా వున్న నేను మీకు కనబడటం లేదు'

'అది కాదే—'

'ఏది కాదు వాడు యిప్పుడు నిద్ర లేవడు 'నిద్రమాత్ర' ఒకటి వేశాను నేను సినిమాకి వెళ్ళేటప్పుడు ఏడుస్తాడని'

'ఏడవలేక పోయావు.'


'నేనెందుకు ఏడవాలి? నేను సినిమాకి వెళ్తే వాడితో మీరు ఏడవాలసి వస్తుందని నిద్రమాత్ర వేశాను. వాడు శుభ్రంగా నిద్రపోతున్నాడు, ఇంతకీ మూడు రూపాయలు తగలేసి ఏమిటి తెచ్చారు?'

'కీ—కారు' అంటూ అనాలోచితంగా జేబులోంచి కారు తీశాడు

'ఈ పిల్లకారుకి మూడు రూపాయలు తగలేశారా? ఆ వెధవ మొహానికి మూడురూపాయల కారా? అదే తక్కువయింది వాడికి—' అంటూ మెరుపులా అతని చేతులోని చిన్నకారుని తీసుకుని దొడ్లో పెంటకుప్పమీదికి విసిరింది.

కుప్పుస్వామికి గుండె ఆగినంత పనయింది. ఒక క్షణకాలం నిర్ఘాంతపోయాడు. అతనికిప్పుడేమిచేయాలో పాలుపోలేదు. దొడ్డిగుమ్మందగ్గర ఆలోచిస్తూ నిలుచుంది అలివేలు. చివరికి అన్నాడు.

'మప్పు మనిషివి కాదు—'



'కాబట్టే మీతో కాపురం చేస్తున్నాను. వచ్చిన జీతాన్నంతా అప్పులవాళ్ళకి అమ్మకి యిచ్చేసి వట్టిచేతులతో ఇంటికి వచ్చిన మీరు మనుష్యులు. మనుష్యులకుండే సహజమైన కోరికలు కోరడం వల్ల నేను మనిషిని కాదు—'

'ఛీ... యింకా సిగ్గులేక మాట్లాడుతున్నావు...పో యిక్కడనుండి' కుప్పుస్వామి మొహంలో రంగులు మారాయి.

'పోతానండి... మీరేమీ ఊరికినే తిండి పెట్టటం లేదు. పగలంతా గొడ్డులా చాకిరీ చేస్తున్నాను. ఈ చాకిరి యింకోచోట చేసుకుంటే నాపొట్ట వెళ్ళిపోతుంది'

'పోవే ... నువ్వుపోతేనేగాని—' అతనికి తరువాత మాటరాలేదు.

'పోతాను... పోతాను...మిమ్మల్నెవరూ అంటిపెట్టుకుని వుండటంలేదు. మీరు నా జీవితాన్ని కడతేరుస్తారని నమ్మకం లేదు—'

అతనేదో అనాలనుకున్నాడు. కాని అంతలో వీధి గుమ్మందగ్గర అలికిడయింది.

'అలివేలు బయలుదేరవమ్మా... నీకో ప్రీపాస్ ఆ అబ్బాయి సంపాదించి పెట్టాడు—' అంది పిన్నిగారు. గుమ్మం దగ్గర నించుని.

'ఏ అబ్బాయి—' భర్తవొంక చూస్తూ కసిగా అంది.

'అదే మూడేళ్ళక్రితం వచ్చాడు. మెట్రిక్ చదవాలని— ఆ కుర్రాడు.'

అలివేలు హైహీల్స్ షూస్ శబ్దం చేసుకుంటూ బయటికి వెళ్ళిపోయింది. కుప్పుస్వామికి ఆమె అతని గుండెలమీదనుండి నడిచి వెళ్ళినట్లయింది. బలహీనంగా కొడుకు వొంక చూశాడు. వాడు అమాయకంగా నిద్రపోతున్నాడు.

భవిష్యత్ అంతా అతనికి అగమ్యగోచరంగా కనబడింది. అతని ఆలోచనలు తెగిపోయాయి.

తూలుతూ నడుస్తూ తన మంచం దగ్గిరికి చేరుకున్నాడు.

గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

గుండెల్ని అరచేతితో రాసుకుంటూ ప్రేమగా కొడుకు వొంక చూశాడు.

అతని కళ్ళకి చీకట్లు క్రమ్ముకుంటున్నాయి.

ఎవరో బలవంతంగా అతని గుండెల్ని అదిమి పెడుతున్నారు. బిగ్గరగా కేక వేయాలనుకున్నాడు.

కాని వేయలేక మంచంమీదికి ఒరిగిపోయాడు.

* * *

ఉదయం ఆరున్నరగంటలకి రంగడు నిద్రలేచాడు. మొహం కడుక్కుందామని దొడ్లోకి వచ్చాడు. పెంటకుప్ప మీద ఎర్రని చిన్నకారు. వాడికళ్ళు ఆనందంతో మెరిశాయి. ముందు వెనక ఆలోచించకుండా ఆ కారు తీసుకుని వరండాలోకి వచ్చాడు. 'కారుకి 'కీ' యిచ్చాడు. అది పరిగెడుతోంది. నవ్వుతున్నాడు. కేరింతలు కొడుతున్నాడు.

'నాన్నా నాన్నా' అంటూ ఉత్సాహంతో తండ్రిని లేపాడు. కాని కుప్పుస్వామి నిద్ర లేవలేదు—

'అమ్మా...అమ్మా' అంటూ తల్లిని పిలిచాడు.

'ఏమిటీ సంబడం. ఎవరో చచ్చినట్లు అలా కేకలు వేస్తావేం!' అంటూ గదమాయించింది అలివేలు. అప్పుడే నిద్ర లేచింది. కొంచం మత్తుగా వుంది ఆమెకి.

'నాన్న నిద్రలేవడం లేదమ్మా' నెమ్మదిగా అన్నాడు రంగడు.

'ఎందుకని ... ఏం రోగమొచ్చిందిగా' అంటూ అతని వొంటి మీద చేయి వేసింది. ఆమెకి షాక్ తగిలినట్లయింది. బాబు కేరింతలు కొడుతూ ఆడుతున్నాడు. బాబు ఆనందాన్ని పంచుకోవడానికి కుప్పుస్వామి నేడు లేడు. అలివేలు కళ్ళల్లో నీళ్ళున్నాయి. కాని వాటికి విలువలేదు. ●

డాక్టర్ కబుర్లు

# కేస్ కార్డ్


ఒక మనిషి హోటల్లో కూర్చుని ఉన్నాడు. హఠాత్తుగా అతను వెనక్కి వాలి పడిపోయాడు ముఖం పాలిపోయింది. వళ్ళంతా చెమటలు.

చుట్టూ ఉన్న వారు నిస్సహాయులయి చూస్తూ ఉండగా ఎవరో డాక్టరుకి కబురు పంపారు. అతనికి కావలసిన అత్యవసరౌషధం బల్లమీదే ఉంది. అది— చక్కెర!

అతను అతిమూత్రవ్యాధితో బాధపడే వ్యక్తి కాబట్టి ఇన్సులిన్ తీసుకున్నాడు కొంచెం ఎక్కువ తీసుకోవటంతో అలాగ అయిపోయాడు.

మరి అటువంటి వేళలలో చెయ్యవలసింది ఏమిటి? ఏదయినా వ్యాధి లేక బలహీనతవల్ల హఠాత్తుగా దెబ్బతినేవారు తమ చేతికి కాని మెడచుట్టూ కాని తమ బాధకి తగిన చికిత్సని సూచించే 'కార్డు' తగిలించుకుంటే మంచిది

కార్డు వీలు లేకపోతే ఒక గొలుసుకి బిళ్ల తగిలించి దాని




మీద తగినంత చికిత్స వర్ణన రాయవచ్చు లేదా "నా పర్సులో చూడండి!" వంటి మాటలు రాయవచ్చు.

ఇది ఎందరో అనుసరిస్తున్న పద్ధతి.

హెచ్. ఎల్. హార్వెన్‌సోన్

(కాపీరయిటు)